సబ్‌స్టేషన్‌లో పనులు చేస్తున్న విద్యుత్ అధికారులు

## సత్యనారాయణపురం సబ్ స్టేషన్ స్వాధీనం

గార్ల, సెప్టెంబర్ 25: మండలంలోని సత్యనారాయణపురం సబ్ స్టేషన్‌ను విద్యుత్ అధికారులు బుధవారం ఎట్టకేలకు స్వాధీనం చేసుకొని మరమ్మతులు చేస్తున్నారు. ఈ సబ్‌స్టేషన్‌ను 2021లో రూ.2కోట్ల వ్యయంతో నిర్మించగా స్థలదాత బాల్‌సింగ్ అడ్డగించడంతో మూడేళ్లు వినియోగంలోకి రాలేదని, స్థల యజమాని, కుటుంబ సభ్యులతో విద్యుత్ అధికారులు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చర్చలు జరిపినట్లు మండల ఏఈ మహేంద్రబాబు తెలిపారు. స్వాధీనం చేసుకొని మరమ్మతులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సీఈ కిషన్, ఎస్ఈ నరేష్, డీఈ విజయ్, ఏడీ రమేశ్ పాల్గొన్నారు.

డీటీ శ్రీదేవికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

## రైతులందరికీ రుణమాఫీ చేయాలి

దంతాలపల్లి, సెప్టెంబర్ 25: రైతులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీని చేయాలని కోరుతూ బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రాన్ని అందజేశారు. ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందన్నారు. వెంటనే కొత్త రేషన్‌కార్డులను అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు తాడ పూర్ణచందర్‌రెడ్డి, దాసరి మురళి, ప్రవీణ్, శేఖర్, ఉమేశ్, వెంకన్న పాల్గొన్నారు.

విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీఈవో

## పాఠశాలలను తనిఖీ చేసిన సీఈవో

గూడూరు, సెప్టెంబర్ 25: మండలంలోని వివిధ అంగన్‌వాడీ పాఠశాలలు, బ్రాహ్మణపల్లిలోని కేజీబీవీ, హాస్టల్స్‌ను జడ్పీ సీఈవో నర్మద బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ పాఠశాలలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. కేజీబీవీలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వంటగదిని పరిశీలించారు. స్థానిక ఎస్సీ బాలుర, బాలికల హాస్టల్స్‌ను తనిఖీ చేసి హాస్టల్స్ ఉన్న పరిసరాలను పరిశీలించి సమస్యలు, అదనపు అవసరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరస్వామి, ఎంపీవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే అండర్ పాస్‌లు నిర్మించాలి

మహబూబాబాద్ రూరల్/ కేసముద్రం, సెప్టెంబర్ 25: సికింద్రాబాద్ డీఆర్ఎం భరతేష్‌కుమార్ జైన్‌ను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ కలిశారు. మహబూబాబాద్ మండలం రంగాపురం వద్ద, కేసముద్రం మండలం అన్నారం, సర్వాపురం గ్రామాల వద్ద రైల్వే అండర్ పాస్‌లు నిర్మించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. రైల్వే అండర్ పాస్ లేకపోవడంతో రైతులు, పశువులు, గొర్రెలు ట్రాక్ పైనుంచి వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అండర్ పాస్‌లను నిర్మించాలని కోరారు. మానుకోటలో లోకో మోటివ్ వర్క్ షాప్ ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కూడా కోరారు.

డీఆర్ఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

# వెల్ఫేర్ బోర్డు ప్రైవేటీకరణ చేయడం తగదు

కేసముద్రం, సెప్టెంబర్ 25: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ వెల్ఫేర్ బోర్డును ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం తగదని, ఈ నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచ వెంకన్న అన్నారు. మండలంలోని ఉప్పరపల్లిలో బుధవారం భవన నిర్మాణ కార్మికులు నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమాన్ని చేపట్టకుండా ప్రభుత్వం బోర్డును ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తోందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న వెల్ఫేర్ బోర్డును ప్రభుత్వ ఆధీనంలో ఉంచి సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. దరావత్ రమేశ్, పాపయ్య, సాయిలు, కొమురయ్య, రూప, భద్రు, బీరయ్య, ఉపేంద్ర, వీరమ్మ, కల్యాణి, సంపత్ ఉన్నారు.

## 'ఏచూరి'ని ఆదర్శంగా తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 25 : యువత సీతారాం ఏచూరిని ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని లోటు అని, యువకుడిగా ఉన్నప్పుడు కళాశాల విద్యార్థుల సమస్యలపై పోరాడారని తెలిపారు. ప్రవీణ్, మహేశ్, వినోద్, మమత పాల్గొన్నారు.

సోమయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## బీఆర్ఎస్ నాయకుడి కుటుంబానికి పరామర్శ

పెద్దవంగర, సెప్టెంబర్ 25: బీఆర్ఎస్ పార్టీ మండలంలోని ఉప్పరగూడెం గ్రామ అధ్యక్షుడు నీలం సోమయ్య(58) గుండెపోటుతో మంగళవారం మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు బుధవారం పరామర్శించారు. మృతుడి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు యాదగిరిరావు, దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, సుధీర్‌కుమార్, వెంకన్న, జ్ఞానేశ్వరచారి, రఘు, సమ్మయ్య, శ్రీనివాస్, రవి, షర్ఫుద్దీన్, కృష్ణమూర్తి, వేణుసాగర్, సోమ్మల్లు, హరీశ్‌యాదవ్ పాల్గొన్నారు.

## ఐటీఐలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 25: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఖాళీ సీట్ల భర్తీకి విద్యార్థులు దరఖాస్తులు చేసుకునే గడువు ఈనెల 28 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి బుధవారం తెలిపారు. మెరిట్ ప్రాతిపదికన సీట్లను కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 25 నుంచి 28 వరకు సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరు కావాలని సూచించారు.

## 28న జాతీయ లోక్ అదాలత్

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 25 : ఈనెల 28న లోక్ అదాలత్ ఉంటుందని, కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకోవాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ బుధవారం తెలిపారు. న్యాయస్థానాల చుట్టూ తిరగకుండా రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. చిన్న కేసులతో జీవితాలను పాడుచేసుకోవద్దన్నారు. మండలవారీగా పోలీసులు రాజీ మార్గాలను గురించి తెలియజేయాలని ఎస్పీ తెలిపారు.

## ఎస్పీని కలిసిన ట్రైనీ ఎస్సైలు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 25 : ట్రైనీ సబ్ ఇన్‌స్పెక్టర్లు బుధవారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమిలో తొమ్మిది నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్లలో మానుకోట జిల్లాకు ముగ్గురిని కేటాయించారు. వారు ఎస్పీని కలవగా పోలీసులు అంటే ప్రజల్లో గౌరవం పెంచేలా విధులు నిర్వర్తించాలని సూచించారు.

## ఎలక్ట్రికల్, టెక్నీషియన్ ఉద్యోగాలకు దరఖాస్తులు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 25 : ఎలక్ట్రికల్, టెక్నీషియన్ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, డిప్లొమా, బీటెక్ అర్హులైన వారు యూఏఈలో కార్పెంటర్లు, స్టీల్ ఫిక్సర్లు, సహాయకుల ఉద్యోగాలకు వేతన ప్యాకేజీ ఉంటుందని పేర్కొన్నారు. 20-40 ఏళ్ల వయస్సు గల వారు ఈ నెల 27న వరంగల్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తుందని, ఆసక్తి అర్హత గల వారు హాజరుకావాలని సూచించారు. సమాచారం కోసం 9985483931ను సంప్రదించాలని తెలిపారు.

## నేడు డివిజన్ స్థాయి క్రీడా పోటీలు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 25 : మానుకోట ఏటీడీవో పరిధిలోని ఆశ్రమ పాఠశాల వసతిగృహాల బాల బాలికల కు గురువారం డివిజన్ స్థాయి క్రీడాపోటీ లు నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ సైదానాయక్ బుధవా రం ఒక ప్రకటనలో తెలిపారు. మండలం లోని రెడ్యాల ప్రభుత్వ ఆశ్రమ బాలుర పాఠశాలలో ఖోఖో, వాలీబాల్, చెస్, కబడ్డీ క్యారమ్, టెన్నిస్ పోటీలు ఉంటాయన్నారు.

## పోలింగ్ డ్యూటీ సర్టిఫికెట్స్ అందజేయాలి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 25 : పోలింగ్ విధుల్లో పాల్గొన్న సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్స్ అందజేయాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు భిక్షపతి అన్నారు. బుధవారం ఆర్డీవో అలివేలును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. హౌస్ ఆఫ్ పార్లమెంట్ పోలింగ్ విధుల్లో వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారని, పీఓలు రెండు రోజులు శిక్షణ, ఓపీఓలు, సిబ్బందికి ఒక రోజు శిక్షణ పొందారని, వీరందరికీ డ్యూటీ సర్టిఫికెట్స్ విడుదల చేయాలని ఆర్డీవోను కోరారు. రామలింగారెడ్డి, ఉపేందర్, శ్రీనివాస్, రవి, బాలచందర్ పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

కేసముద్రం, సెప్టెంబర్ 25: అన్ని దానాల్లోకెల్ల రక్తదానం గొప్పదని, రక్తదానం ప్రాణదానంతో సమానమని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ పీవీ ప్రసాద్ అన్నారు. సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా సహాయ ఫౌండేషన్ పనిచేయడం అభినందనీయమన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు రావుల రవిచందర్‌రెడ్డి, డాక్టర్ అల్లం రమ, సహాయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తొనుపునూరి సాయికృష్ణ, అధ్యక్షుడు పెరుమాండ్ల చరణ్‌గౌడ్, గొర్రె వెంకన్న, రేణుకుంట్ల సుధాకర్, నల్ల కిరణ్, కోదండపాణి, గుగులోత్ వీరునాయక్, ఇమ్రాన్, తరాల భరత్, యశ్వంత్, ప్రతిభ, యశ్వంత్ ఉన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

# నిరుపేదలకు ప్రభుత్వం న్యాయం చేయాలి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 25 : ప్రభుత్వం నిరుపేదలకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం పేదలు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ అధికారులు కూల్చొద్దని మున్సిపల్ ఆఫీస్ ముందు ఆ పార్టీ ఆధ్వర్యం లో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని గుండ్ల కుంట కాలనీ, గోపాలపురం కాలనీ, ఆకుల లక్ష్మయ్య నగర్‌లో నిరుపేదలు ఏళ్లుగా నివసిస్తున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు లోతట్టు ప్రాం తమంటూ నోటీస్ ఇచ్చి పేదలను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. ఎమ్మె ల్యే, ఎంపీ చొరవ తీసుకుని నిరుపేదలకు న్యా యం చేయాలని కోరారు. మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సమ్మెట రాజమౌళి, కుంట ఉపేందర్, యాకయ్య, నాగన్న, భాగ్యమ్మ, మచ్చ వెంకన్న, భిక్షపతి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

# రైతు రుణమాఫీ డబ్బులు ఇవ్వాలి

వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం ప్రతినిధులు

కురవి, సెప్టెంబర్ 25: రైతు రుణమాఫీ డబ్బులను వెంటనే ఇవ్వాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండలంలోని బలపాల ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ సాంబశివరావుకు బుధవారం రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజన సంఘం నాయకుడు కిషన్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం రుణమాఫీ చేసిన రైతులకు డబ్బులు ఇవ్వడంలో బ్యాంకులు ఇబ్బంది పెడుతున్నాయని ఆరోపించారు. రైతులకు వెంటనే డబ్బులు ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు రన్వాల్ రామకృష్ణ, మాలోత్ హరిలాల్, స్వామి, ఈరా, వెంకన్న, రమేశ్, ధర్మ పాల్గొన్నారు.

# గుణాత్మక విద్యను అందించాలి

గార్ల, సెప్టెంబర్ 25: ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరూనాయక్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల సన్మాన వీడ్కోలు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందన్నారు. ఎంఈఓ వీరభద్రరావు, టీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మాలోత్ శివనాయక్, మండల నాయకుడు భాస్కర్ బాలాజీ, సుందర్ టీడబ్ల్యూటీ రాష్ట్ర నాయకులు హరిసింగ్, ఏటీఎఫ్ నాయకులు రామచంద్ర, మాజీ ప్రధానోపాధ్యాయురాలు కోటేశ్వరి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వీరూనాయక్

# కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్రం

తొర్రూరు, సెప్టెంబర్ 25: కేంద్ర ప్రభుత్వం నూతన లేబర్ కోడ్స్ పేరుతో హక్కులను హరించే కుట్ర చేస్తోందని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్ర భుత్వం లేబర్ కోడ్స్ ప్రతులను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ లేకుండా ఆమోదించడం దేశ చరిత్రలో చీకటి రోజు అని అన్నారు. నూతన లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. జిల్లా నాయకులు మంగళపల్లి ప్రసాద్, అర్వపల్లి వెంకన్న, రాములు, నవీన్, మల్లేశ్, వెంకన్న, రామస్వామి, రాజు, రమేశ్, వెంకటమ్మ పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

## పీఆర్సీ అమలు చేయండి

- 'ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు'లను రెగ్యులర్ చేయాలి
- టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ విజ్ఞప్తి

వేములవాడ, సెప్టెంబర్ 25: దేవాదాయశాఖ ఉద్యోగులకు ఇప్పటికే నాలుగు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం మూడింటిని ఈ పండుగలోగా విడుదల చేయాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, 261 జీవోను సవరించి ఉద్యోగులందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి న్యాయం చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని హోటల్ ఎస్ఆర్ఆర్ గ్రాండ్‌లో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ. దేవాదాయ శాఖలో 1975 నాటి క్యాడర్ స్ట్రెంత్‌నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని తెలిపారు. ఆలయాల్లో భక్తుల రద్దీ, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఐదేండ్లకోసారి క్యాడర్ స్ట్రెంత్‌ను రివైజ్ చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. 317 జీవో తీసుకొచ్చి జోనల్ వ్యవస్థలో బదిలీచేసి ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు.

## రైతులకు కంగన క్షమాపణ

### రైతు చట్టాలపై వ్యాఖ్యలు వెనక్కి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: తన దురుసు వ్యాఖ్యలతో నోరు పారేసుకున్న నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ రైతులకు క్షమాపణ చెప్పారు. 2021లో కేంద్రం రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలంటూ ఆమె ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వివాదాస్పద రైతు చట్టాలపై తాను చేసిన వ్యాఖ్యలు చాలామందిని అసంతృప్తి, బాధకు గురి చేశాయని, దీనికి తనను క్షమించాలని ఆమె కోరారు. 'కొద్ది రోజుల క్రితం రైతు చట్టాలపై మీడియా నన్ను కొన్ని ప్రశ్నలు వేసింది. గతంలో రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలని నేను ప్రధాని మోదీని కోరుతానని చెప్పా. అయితే నేను చేసిన ఈ ప్రకటన చాలామందిని బాధించింది. నా ప్రకటన వెనక్కి తీసుకుంటూ క్షమాపణలు చెబుతున్నా. నేనొక బీజేపీ కార్యకర్తను. నేను చేసే ప్రకటనలు పార్టీ అభిప్రాయాన్ని ప్రతిబింబించేవిగా ఉండాలి తప్ప, వ్యక్తిగతంగా ఉండకూడదు' అని ఆమె ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. కాగా, కంగనా చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, వాటికి పార్టీతో సంబంధం లేదని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అంతకుముందు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రైవేటు భవనానికి సర్కారీ సోకులు!

- శంషాబాద్ డబ్ల్యూటీసీ భవనంలో ఏఐ ఫెసిలిటీ సెంటర్
- అసంపూర్తి నిర్మాణంలో తాత్కాలిక కేంద్రం
- ట్రై సిటీల్లో అందుబాటులో సర్కారీ భవనాలు
- కపిల్ గ్రూపుతో ఐటీశాఖ ఒప్పందంపై ఆరోపణలు

## ఫోర్త్ సిటీ.. 'ఫ్యూచర్' ట్రేడింగ్!

ప్రత్యేక కథనం - 8

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్.. ఫోర్త్ అలియాస్ ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఏఐ సిటీ నిర్మాణ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేస్తున్న సెంటర్. అంటే తాత్కాలిక కేంద్రమన్న మాట. ప్రభుత్వ పరంగా టీ-హబ్, టీ-వర్క్స్, ట్రిపుల్ ఐటీ.. ఇలా చెప్పుకుంటూ పోతే లక్షల చదరపు అడుగుల్లో విశాలమైన , అద్భుతమైన భవనాలు అందుబాటులో ఉండగా అసంపూర్తి అద్దె భవనంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎప్పుడు పూర్తవుతుందో తెలియని ఈ భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్‌ను ఎందుకు ఏర్పాటు చేస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీకి రానున్న రోజుల్లో ఎంతో ప్రాధాన్యం ఉండనుందని కేసీఆర్ ప్రభుత్వం ఆదిలోనే గుర్తించింది. అందుకే హైదరాబాద్ వేదికగా ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024 నిర్వహించేందుకు గతంలోనే చొరవ తీసుకుంది. కొన్నిరోజుల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏఐ ప్రాధాన్యత దృష్ట్యా 'ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024'ను నిర్వహించింది. ఈ క్రమంలోనే ఏఐ సిటీని ఏర్పాటు చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, సిటీ నిర్మాణం పూర్తయ్యే వరకు కార్యకలాపాలు, పురోగతి, ఇతరత్రా వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షించేందుకు ఒక కేంద్రం కావాలి. అదే ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్. దీనిని ఏర్పాటు చేస్తున్నట్టు సమ్మిట్ వేదికగానే రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. కాకపోతే ఆ కేంద్రాన్ని శంషాబాద్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రం (వరల్డ్ ట్రేడ్ సెంటర్)లోని రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇదే అందరినీ విస్మయానికి గురి చేసింది.

### ఇంతకీ ఏమిటీ డబ్ల్యూటీసీ?

దేశంలోనే అతిపెద్ద వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నామంటూ జూన్ 2022 నగరానికి చెందిన కపిల్ గ్రూపు ఆర్భాటంగా ప్రకటించింది. శంషాబాద్ విమానాశ్రయం తూర్పు ముఖం దగ్గర శ్రీశైలం హైవేను అనుకొని 50-60 ఎకరాల్లో 12 అంతస్తులతో కూడిన భవనాన్ని నిర్మిస్తామని చెప్పింది. ఇందుకోసం సుమారు రూ.4 వేల కోట్లను పెట్టుబడిగా పెడుతున్నట్టు ప్రకటించింది. కారణాలు ఏవైనా ఆ ప్రాజెక్టు ఇప్పటివరకు పూర్తి కాలేదు. కేవలం గ్రౌండ్ ఫ్లోర్ సహా మూడు అంతస్తులతో కూడిన రెండు టవర్ల నిర్మాణం మాత్రమే ఇప్పటికీ పురోగతిలో ఉంది. అంటే మూడేండ్ల కిందట మొదలుపెట్టిన ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం వేగంగా పనులు కొనసాగించినా ప్రాజెక్టు పూర్తయ్యేందుకు మరో ఏడాది పట్టే అవకాశం ఉంది. ఇలాంటి అసంపూర్తి భవనాల్లో ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

### ఒప్పందంలోని షరతులేమిటో?

శంషాబాద్ విమానాశ్రయం తూర్పు వైపు నిర్మిస్తున్న డబ్ల్యూటీసీ శంషాబాద్ ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణం వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పూర్తవుతుందని కంపెనీ చెప్తున్నది. అలాంటప్పుడు ఏడాది తర్వాత పూర్తయ్యే భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం. ఆ మేరకు ఒప్పందం కూడా పూర్తయినట్టు తెలుస్తున్నది. అయితే, ఆ ఒప్పందంలో ఏముందనేది మాత్రం బయటికి రావడం లేదు. ఏడాదికి గాని పూర్తికాని భవనంలో తాత్కాలిక సెంటర్ ఏర్పాటు చేయాలనుకోవడం ఒక ఎత్తయితే, ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం తరపున సదరు గ్రూపునకు ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలు ఏమిటన్నవి తెలియరాలేదు. భవనం పూర్తయ్యాక సెంటర్ ఏర్పాటు చేస్తారా? లేదంటే భవనం పూర్తికి ప్రభుత్వ పరంగా ఆర్థికంగా చేయూత అందిస్తారా? అసలు ఆ భవనాన్ని ఎంచుకోవడానికి కారణం ఏమిటి? ఇలా అనేక సందేహాలు అందరి మెదళ్లను తొలుస్తున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ భూమాయకు సంబంధించిన వివరాలు మీ దగ్గర ఉంటే మాకు వాట్సాప్ చేయండి
**91827 77711**

### టీ హబ్ కేంద్రంగా 60కి పైగా ఏఐ స్టార్టప్‌లు

కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ-హబ్ అంతర్జాతీయస్థాయిలో టెక్నాలజీ స్టార్టప్‌లకు కేంద్రంగా మారింది. ఐటీ కారిడార్‌లో అత్యంత విశాలమైన ప్రాంగణంలో ఉన్న టీ-హబ్‌లో రకరకాల టెక్నాలజీ స్టార్టప్‌లు ఉన్నాయి. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)కి సంబంధించిన టెక్నాలజీ స్టార్టప్‌లే 60కి పైగా ఉన్నాయి. ఇక్కడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏఐ స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ప్రత్యేకంగా వ్యవస్థలు ఏర్పాటయ్యాయి. స్టార్టప్‌లకు, ఐటీ కంపెనీలకు ఎంతో అనుకూలంగా ఉండే ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఐటీ శాఖకే చెందిన భవనం కావడంతో పైసా ఖర్చు లేకుండా ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటవుతుంది. టీ-వర్క్స్, ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో అనేక భవనాలు ఉన్నాయి. సర్కారు మనసు పెడితే రెండు లక్షల చదరపు అడుగులు సులువైన ప్రక్రియ. కానీ వీటిని కాదని ప్రైవేటు సంస్థకు చెందిన భవనంలోనే ఏర్పాటు చేయడం వెనక మర్మమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏఐ సిటీ 200 ఎకరాల్లో ఏర్పాటు కానుంది. ప్రస్తుతం నిర్మాణ రంగంలోని పరిజ్ఞానం, వనరుల దృష్ట్యా రెండు లక్షల చదరపు అడుగుల్లో ఒక భవనాన్ని నిర్మించడమనేది అత్యంత సులువైన ప్రక్రియ. ఈ క్రమంలో అక్కడే ఒక తాత్కాలిక భవనాన్ని నిర్మించుకునే వెసులుబాటు కూడా ఉంది. ఏఐ సిటీ పూర్తయిన తర్వాత ఈ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసిన భవనాన్ని కూడా వినియోగించుకోవచ్చు. అయినప్పటికీ అసంపూర్తి, ప్రైవేటు భవనాన్ని ఎంచుకోవడం వెనక అసలు ఉద్దేశం వేరే ఉందన్న చర్చ జరుగుతున్నది.

# స్క్వాల్ ఫార్మేషన్‌తోనే కూలిన చెట్లు

- పునరుద్ధరణ జరగాలంటే వందేండ్లు
- నిర్ధారణకు వచ్చిన అటవీ శాస్త్రవేత్తలు
- విపత్తును పసికట్టిన వన్యప్రాణులు

ములుగు, సెప్టెంబర్ 25 (నమస్తేతెలంగాణ): బంగాళాఖాతంతోపాటు అరేబియా సముద్రంలో గత నెల 31న ఏర్పడిన తుఫాన్‌ల కారణంగా గంటకు 125 కిలోమీటర్ల వేగంతో వీచిన భారీ గాలుల ఒత్తిడితో ఏర్పడిన స్క్వాల్ ఫార్మేషన్‌తోనే ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవిలో భారీ ఎత్తున చెట్లు నేలకూలాయని అటవీ శాఖ పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో అటవీశాఖ అధికారులతోపాటు 10 నుంచి 12 సంస్థలకు చెందిన నిష్ణాతులైన శాస్త్రవేత్తలతో వర్క్‌షాపు నిర్వహించి విధ్వంసానికి గల ప్రధాన కారణాలను అంచనా వేశారు. తాడ్వాయి, మేడారం, పస్రా అటవీ ప్రాంతంలో ఆగస్టు 31న జరిగిన దుర్ఘటన వల్ల 332 హెక్టార్లలో అడవికి నష్టం జరిగి 50 వేలకు పైగా చెట్లు నేలకూలాయని చెప్పారు. ప్రాథమిక నివేదిక ప్రకారం రూ.30 కోట్ల నష్టం జరిగిందని, కలపతో కలుపుకుంటే రూ.100 కోట్ల నష్టం వరకు ఉంటుందని తెలిపారు. పర్యావరణం దృష్టితో చూస్తే రూ.100 కోట్లకు పైగా నష్టం జరిగిందని పేర్కొన్నారు. దట్టమైన 100 నుంచి 200 ఏండ్ల చెట్లు కూలాయని, అంతటి దట్టమైన అడవి తిరిగి రూపొందాలంటే వందేండ్లు పడుతుందని వివరించారు. నష్టం జరిగిన ప్రదేశంలో చెట్లను కాపాడుకుంటే ఐదేండ్లలో అడవి ఏర్పడుతుందని, భారీ వృక్షాలు కావాలంటే చాలా సమయం పడుతుందని పేర్కొన్నారు. రెండు ప్రాంతాల్లో ఒకేసారి వచ్చిన తుఫాను వల్ల భారీ ఒత్తిడితో గాలులు వీచి మేఘాలు ఒక దానిపై ఒకటి వచ్చిన సమయంలో ఇలాంటి పరిస్థితులు తలెత్తుతాయని అధికారులు నిర్ధారణకు వచ్చారని చెప్పారు. నష్టం జరిగిన రోజు సంఘటన ప్రాంతంలో 25 నుంచి 26 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని, దీంతోపాటు గంటకు 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని, కొంత ప్రాంతంలో 160 నుంచి 170 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచినట్టు కనుగొన్నామని తెలిపారు. వర్క్ షాపులో పాల్గొన్న శాస్త్రవేత్తలు ఎవరూ ఇంతటి తీవ్రతను చూడలేదని చెప్పారని వివరించారు. గతంలో మధ్యప్రదేశ్, అండమాన్, నికోబార్ దీవుల్లోని అడవుల్లో కొద్ది ప్రాంతంలో చెట్లకు నష్టం జరిగిందని, ప్రస్తుతం తాడ్వాయి అడవుల్లో భారీ మొత్తంలో నష్టం జరిగిందని చెప్పారు. చెట్లు కూలిన ప్రాంతంలో వన్య ప్రాణులకు హాని జరగలేదని, విపత్తును ముందే తెలుసుకొని సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్టుగా నిర్ధారణకు వచ్చామని పేర్కొన్నారు. దుర్ఘటనకు గల కారణాలపై నివేదిక రూపొందించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కార్యాచరణ చేపడతామని తెలిపారు.

## ఆరోగ్య ప్రదాత కేసీఆర్

ఇటీవల విడుదలైన ఫలితాల్లో సింగరేణి వైద్య కళాశాల విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణత సాధించడంపై రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ హర్షం వ్యక్తంచేశారు. బుధవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆరోగ్య ప్రదాత కేసీఆర్ అని కొనియాడారు. - గోదావరిఖని

## పారిశుద్ధ్య కార్మికుల కాళ్లు కడిగి..

వరంగల్ జిల్లా నెక్కొండలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో, జిల్లా పంచాయతీ అధికారి రాంరెడ్డి కార్మికుల కాళ్లు కడిగారు. ఈ సందర్భంగా గ్రామాల్లో వారు చేస్తున్న సేవలను కొనియాడారు. నెక్కొండ, ముదిగొండకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు బస్కె శ్రీనివాస్, ఒరుగంటి ప్రమీలను ఘనంగా సత్కరించారు. - నెక్కొండ